సాక్షి సంగారెడ్డి

బుధవారం : 3 : మే : 2023



ఆన్‌లైన్లో సైబర్ మోసం

రెట్టింపు నగదు ఇస్తామని పెద్ద ఎత్తున నగదును సైబర్ నేరగాళ్లు దోచుకున్న సంఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. 8లో



త్వరితగతిన పనులు పూర్తిచేయాలి

అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆయా శాఖల అధికారులతో పనులపై సమావేశం నిర్వహించారు. 9లో

అందరికీ నెగెటివ్



పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం 12 మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు చేయగా అందులో అందరికీ నెగెటివ్ వచ్చినట్లు టెస్టుల నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. అదేవిధంగా ఆర్టీపీసీఆర్ టెస్టులు 15 మందికి చేసినట్లు వెల్లడించారు.

న్యూస్‌రీల్

కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



ఓపీ సేవల వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ శరత్

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రిని కలెక్టర్ శరత్ మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ఓపీ సేవలకు వచ్చే రోగులకు కూర్చునేందుకు సరైన వసతి లేకపోవడం గమనించారు. వెంటనే వారు కూర్చున్నందుకు ఏర్పాటు చేయాలని ఆస్పత్రి వైద్య సిబ్బందిని ఆదేశించారు. అదేవిధంగా సివిల్ ఆర్థోపెటిక్ సర్జన్ తో పాటు మరో వైద్యుడు హాజరు కాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే వారి వివరాలు తెలియజేయాలన్నారు. అలాగే ఆస్పత్రికి వచ్చే రోగులకు ఏ సేవలు ఎక్కడ అందుతున్నాయో తెలిసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. వైద్య సేవలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు.

కూలీలతో ఎమ్మెల్యే ముచ్చట్లు



ఉపాధి కూలీలతో ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్

వట్‌పల్లి(అందోల్): మండల పరిధిలోని ఖాదిరాబాద్ గ్రామంలో మంగళవారం వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడానికి వెళ్తున్నారు. ఈక్రమంలో తనకు ఎదురైన మహిళా కూలీలను అవ్వా బాగున్నారా అంటూ పలుకరించి, ఉపాధి హామీ పథకం అమలు తీరుపై అడిగి తెలుసుకున్నారు. ఎండలను దృష్టిలో పెట్టుకొని వడదెబ్బ తగులకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

విదేశాలలో ఉద్యోగ అవకాశాలు

సంగారెడ్డిటౌన్: అర్హత, నైపుణ్యం కలిగిన సెమీ స్కిల్డ్ కార్మికులకు తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్ కామ్) ద్వారా విదేశాలలో ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి వందన మంగళవారం తెలిపారు. టామ్ కామ్ ద్వారా గల్ఫ్ దేశాలతో పాటు ఆస్ట్రేలియా, యూకే తదితర దేశాల్లో ఉపాధి అవకాశం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. తమ కెరీర్‌ని మార్చుకోవాలనుకునే నిరుద్యోగ యువత, ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నర్సులు, ఆరోగ్య కార్యకర్తలు, ఫార్మా సిబ్బంది తదితర ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. టామ్ కామ్ వెబ్‌సైట్‌లో ఆయా దేశాలలోగల ఉద్యోగాల వివరాలు, అర్హతలు వేతన వివరాలు తెలుస్తాయన్నారు. అర్హత, ఆసక్తిగల అభ్యర్థులు టామ్ కామ్ వెబ్‌సైట్ ద్వారా, లేదా మరిన్ని వివరాలకు జిల్లా ఉపాధి కల్పన అధికారి కార్యాలయంలో నేరుగాగాని, 9502894238 నంబర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చన్నారు.

రేపు జాబ్ మేళా

సంగారెడ్డిటౌన్: జిల్లా ఉపాధి శాఖ ఆధ్వర్యంలో ఈనెల 4వ తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి వందన మంగళవారం తెలిపారు. శ్రీవిజయ బయో ఫర్టిలైజర్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో 80 ఉద్యోగాల భర్తీకి మే 4వ తేదీ ఉదయం 11 నుంచి 2 గంటల వరకు సంగారెడ్డి బైపాస్‌లో గల పాత వెలుగు ఆఫీస్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయ ప్రాంగణంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థుల వయస్సు 18 నుంచి 35 సంవత్సరాల లోపు ఉండాలని, టెన్త్, ఇంటర్, డిగ్రీ విద్యార్హతగల అభ్యర్థులు అర్హులన్నారు. జీతం 14 వేల నుంచి 35 వేల వరకు ఉంటుందన్నారు. ఆసక్తి, అర్హతగల అభ్యర్థులు ఈనెల 4వ తేదీన నిర్ణీత సమయంలోగా తమ విద్యార్హతల ధ్రువపత్రాలు, ఎస్ఎస్సీ మెమో, ఆధార్ కార్డ్, కుల ధ్రువీకరణ సర్టిఫికెట్ల జిరాక్‌తో నేరుగా జాబ్ మేళాకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 08455 271010 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

పన్ను వసూళ్లలో బొల్లారం టాప్

జిన్నారం(పటాన్‌చెరు): రాయితీ పన్ను వసూళ్లలో బొల్లారం పురపాలక సంఘం జిల్లాలోనే మొదటి స్థానంలో నిలిచిందని బొల్లారం మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ జిన్నారం మండలం బొల్లారం మున్సిపల్‌లో రాయితీ పన్నులు రూ. 4.14 కోట్లను వసూలు చేసి, 39.64 శాతంతో జిల్లాలోనే పన్నుల వసూలులో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు.

తూకాలు వేసేదెప్పుడు?

- కేంద్రాలు తెరిచినా ధాన్యం కాంటాలు వేయని నిర్వాహకులు
- నిర్ణీత తేమ రావడం లేదంటూ సాకు
- కొనుగోలు కేంద్రాల్లో అన్నదాతల పడిగాపులు
- అకాల వర్షాల నుంచి పంటను కాపాడుకోలేక అష్టకష్టాలు



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: ధాన్యం కుప్పను సరిచేస్తున్న ఈ రైతు దంపతులు జింక విఠల్, సువర్ణలు. కల్హేర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి ధాన్యాన్ని తెచ్చి ఐదు రోజులైంది. కొనుగోలు కేంద్రం ప్రారంభమైనప్పటికీ, తూకాలు వేయకపోవడంతో వారు ఐదు రోజులుగా ధాన్యం కుప్ప వద్ద రాత్రింబవళ్లు పడిగాపులు కాస్తున్నారు. నిత్యం కురుస్తున్న అకాల వర్షం నుంచి తమ ధాన్యాన్ని కాపాడుకునేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితి ఒక్క విఠల్‌దే కాదు, జిల్లాలో వేలాది మంది ధాన్యం రైతులదీ. కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడం, ప్రారంభమైన చోట్ల ధాన్యం కాంటాలు వేయకపోవడంతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తెచ్చి వారం రోజులు గడుస్తున్నప్పటికీ కేంద్రాల నిర్వాహకులు పట్టించుకోకపోవడంతో రైతులకు ఎదురుచూపులు తప్పడం లేదు. రేయింబవళ్లు ధాన్యం కుప్ప వద్ద పడిగాపులు కాస్తున్నారు. ఎప్పుడెప్పుడు కొనుగోళ్లు ప్రారంభిస్తారా? అని ఎదురుచూస్తున్నారు.

కొనుగోళ్లు ఎప్పుడు?

- ఈ యాసంగి సీజనులో జిల్లాలో 1.01 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. ఎకరానికి 2.3 టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఈలెక్కన ఈసారి 2.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని లెక్కగట్టారు.
- ఇందులో స్థానికంగా వినియోగానికి పోగా, 2.07 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంటుందని అంచనా వేసింది. ఇందుకోసం 209 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని జిల్లా అధికార యంత్రాంగం నిర్ణయించింది.
- ఇప్పటి వరకు 77 కేంద్రాలను ప్రారంభించారు. కానీ, ఈ కేంద్రాల్లో కొనుగోళ్లను ప్రారంభించలేదు. రైతుల ధాన్యాన్ని తూకాలు వేసి, రైసు మిల్లులకు పంపాల్సి ఉంటుంది.
- అనంతరం కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరుస్తేనే రైతుల ఖాతాల్లో ధాన్యం డబ్బులు జమవుతాయి. కానీ, కొనుగోలు కేంద్రాల్లో తూకాలే ప్రారంభం కాకపోవడంతో రైతులు ధాన్యం కుప్పల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోంది.

400 మెట్రిక్ టన్నులే..

- ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా కేవలం 400 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేశారు. ఈ లెక్కన 77 కేంద్రాలు ప్రారంభమైనప్పటికీ తూకాలు మాత్రం కావడం లేదనేది స్పష్టమవుతోంది.
- అయితే నిర్ణీత మేరకు తేమ ఉంటేనే ధాన్యాన్ని సేకరిస్తుంటారు.
- తూకాల్లో జాప్యం జరుగుతుండటంతో కేంద్రాలకు తెచ్చిన ధాన్యం తడిసిపోతోంది. దీంతో రైతులు ఆ ధాన్యాన్ని ఆరబెట్టినప్పటికీ కాంటాలు వేయడంలో వారాల తరబడి జాప్యం చేస్తుండటంతో మళ్లీ కురుస్తున్న వర్షాలకు మరో మారు ధాన్యం తడిసిముద్దవుతోంది.
- ఆరిన వెంటనే ధాన్యం తూకం వేసి, రైసుమిల్లులకు తరలిస్తే రైతులకు అకాల వర్షాల తిప్పలు తప్పుతాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అధికారులు మాత్రం నిర్ణీత తేమ లేదంటూ జాప్యం చేస్తున్నారు.

వెంటనే కొనుగోలు చేయాలి



నాకున్న నాలుగు ఎకరాల్లో పండిన పంటను అమ్ముకునేందుకు కల్హేర్ కొనుగోలు కేంద్రానికి తెచ్చాను. ఐదు రోజులవుతోంది. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు తూకం వేయడం లేదు. వరుసగా వర్షాలు కురుస్తున్నాయి. ఆరబెట్టిన వెంటనే తూకం వేస్తే మాకు ఇబ్బందులు ఉండవు. నిర్ణీత మేరకు తేమ ఉన్నప్పటికీ తూకం వేయకపోవడంతో పడిగాపులు కాయాల్సి వస్తోంది. వెంటనే ధాన్యం తూకాలు వేయాలి. – విఠల్, రైతు, కల్హేర్

తూతూ మంత్రంగా ప్రజాభిప్రాయ సేకరణ



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని మద్దికుంట శివారులో ప్రతిపాదిత జీవవైద్య వ్యర్థాల ఉమ్మడి నిర్వహణ కేంద్రం ఏర్పాటుకు మంగళవారం నిర్వహించిన పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ తూతూమంత్రంగా సాగింది. నూతనంగా ఏర్పాటు చేస్తున్న కామన్ బయో మెడికల్ వేస్ట్ ట్రీట్‌మెంట్ ఫెసిలిటీకి సంబంధించి కనీసం చుట్టూ పక్కల సమీప గ్రామాల రైతులు, ప్రజలు, ప్రజాప్రతినిధుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవడంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు విఫలమయ్యారని రైతులు, ప్రజలు ఆరోపించారు. కార్యక్రమానికి అదనపు కలెక్టర్ వీరారెడ్డి హాజరై మద్దికుంట ప్రజలు, రైతులు, యువకుల అభిప్రాయాలను నమోదు చేసుకున్నారు. అనంతరం అయన మాట్లాడారు. ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా వెల్లడైన అభిప్రాయాలను నమోదు చేయడం జరిగిందన్నారు. ప్రజల అభిప్రాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. గుట్టు చప్పుడు కాకుండా తమకు అనుకూలంగా ఉన్న వారిని మాత్రమే పిలిచి వారి అభిప్రాయాలను సేకరించి పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని తూతూమంత్రంగా ముగించారని పలువురు ఆరోపించారు. ప్లాస్టిక్ రీసైక్లింగ్‌తో దుర్వాసన, పొగతో ప్రజలు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని ప్రజలు వాపోయారు. వాయు, జల కాలుష్యం ఏర్పడి సమీపంలో ఉన్న పంట పొలాలు కలుషితమై పంటలు పండవని రైతులు వాపోయారు. కార్యక్రమంలో తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి, ఎంపీడీఓ పూజ, ఆర్ఐ గణేష్, పీసీబీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల్లో కొండాపూర్ జట్టు గెలుపు



విజేతలతో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మఠం భిక్షపతి

జోగిపేట(అందోల్): జోగిపేటలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా కబడ్డీ పోటీల్లో కొండాపూర్ జట్టు విజేతగా నిలిచింది. గెలుపొందిన జట్టుకు రూ.50 వేల నగదు బహుమతిని నిర్వాహకులు అందజేశారు. ద్వితీయ బహుమతి పాపన్నపేట జట్టు గెలుచుకోగా రూ.20 వేలు, తృతీయ బహుమతి జోగిపేటకు చెందిన హనుమాన్ జట్టు గెలుచుకోగా రూ.10 వేలు, నాలుగో బహుమతి కొడిపాక జట్టు గెలుచుకోగా రూ.10 వేల నగదు అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మఠం భిక్షపతి ఉమ్మడి జిల్లా స్థాయిలో కబడ్డీ పోటీలను నిర్వహించిన కౌన్సిలర్ కోరబోయిన నాగరాజును అభినందించారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వం గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహిస్తుందన్నారు. గెలుపొందిన జట్టుకు సొంతంగా రూ.10 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో మున్సిఫ్ కోర్టు ఏజీపీ హరినారాయణ వర్మ, మాజీ ఎంపీపీ రామగౌడ్, లైన్స్ క్లబ్ జోన్ చైర్మన్ ఆకుల రాంబాబు, జోగిపేట మాజీ వాసవీ క్లబ్ అధ్యక్షుడు రంగా కిషన్, కోఆప్షన్ సభ్యులు ఎండి ఫైజల్, కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్, కోచ్‌లు జుట్టు వరప్రసాద్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో మెరుగైన విద్యాబోధన



విద్యార్థిని సన్మానిస్తున్న అధికారులు

ఉమ్మడి మెదక్ జిల్లా రెసిడెన్షియల్ లెర్నింగ్ కోఆర్డినేటర్ నర్సింహ

జహీరాబాద్ టౌన్: గురుకులాల్లో మెరుగైన విద్యాబోధన లభిస్తుందని ఉమ్మడి మెదక్ జిల్లా రెసిడెన్షియల్ లెర్నింగ్ కోఆర్డినేటర్ (ఆర్ఎల్‌సీ) నర్సింహ అన్నారు. జహీరాబాద్ మండలంలోని అల్గోల్ మైనార్టీ గురుకుల కళాశాల విద్యార్థి షేక్ ఫెరోజ్ జేఈఈ ఆడ్వాన్స్‌కు అర్హత సాధించిన సందర్భంగా మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనార్టీ గురుకులాల్లో మౌలిక సదుపాయాలతో పాటు మెరుగైన విద్య అందుతుందన్నారు. కార్యక్రమంలో విజిలెన్స్ అధికారి గౌస్ పాష, కళాశాల ప్రిన్సిపాల్ జమీల్, గురుకులం ప్రిన్సిపాల్ రాములు తదితరులు పాల్గొన్నారు.

డీఈఓగా వేంకటేశ్వర్లు

కొండాపూర్(సంగారెడ్డి): సంగారెడ్డి జిల్లా డీఈఓగా వేంకటేశ్వర్లు మంగళవారం నియమితులయ్యారు. ఈయన మంచిర్యాల జిల్లా విద్యాధికారిగా విధులు నిర్వర్తిస్తూ సంగారెడ్డికి బదిలీపై వచ్చారు. గతంలో ఇక్కడ డీఈఓగా విధులు నిర్వహించిన రాజేశ్ ఏసీబీకి పట్టుబడి అరెస్ట్ అయ్యారు. అప్పటి నుంచి డీఈఓ కార్యాలయ ఏడీగా ఉన్న విజయను ఇన్‌చార్జి డీఈఓగా నియమించారు.

సకాలంలో పనులు పూర్తి చేయాలి

ఇన్‌చార్జి డీఈఓ విజయ



కోహీర్ పాఠశాలలో పనులపై చర్చిస్తున్న ఇన్‌చార్జి డీఈఓ విజయ

కోహీర్(జహీరాబాద్): విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే మన ఊరు మనబడి పనులను పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి జిల్లా విద్యాధికారి విజయ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కోహీర్, నాగిరెడ్డిపల్లి, బిలాల్‌పూర్ పాఠశాలల్లో మనఊరు మనబడి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన నిర్మాణాలు పరిశీలించారు. పనుల పురోగతి నివేదికలను కలెక్టర్‌కు పంపుతామన్నారు. ఆమె వెంట సర్వశిక్ష అభియాన్ సీఎంఓ వెంకటేషం, బిలాల్‌పూర్ సర్పంచ్ నర్సింహులు మండల విద్యాధికారి శంకర్, ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్లు ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేస్తే సహించేది లేదు

బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ గౌడ్



మాట్లాడుతున్న బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ గౌడ్

పటాన్‌చెరుటౌన్: కేంద్ర ప్రభుత్వంపై ఎమ్మెల్యే విమర్శలు చేస్తే సహించేది లేదని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ గౌడ్ అన్నారు. మంగళవారం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మే డే సందర్భంగా ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి కేంద్ర ప్రభుత్వంపై చేసిన వ్యాఖ్యలు సరికాదన్నారు. రాష్ట్రంలోని పరిశ్రమల్లో 60 శాతం కన్నా ఎక్కువ భాగస్వామ్యం ఉన్న రాష్ట్ర ప్రభుత్వాన్ని కాదని కేంద్ర ప్రభుత్వం కంపెనీలను ఏ విధంగా ప్రైవేటీకరణ చేస్తుందో చెప్పాలని ప్రశ్నించారు. రూ.1600 కోట్లతో నిర్మించిన రాష్ట్ర సచివాలయంలోకి ఇతర పార్టీల నాయకులు, సామాన్య ప్రజలకు అనుమతి కల్పించలేని దౌర్భాగ్య పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని మండిపడ్డారు. సీఎస్ఆర్ నిధులను ఇష్టానుసారంగా ఖర్చుచేసి, తానేదో సొంత నిధులను ఖర్చు చేసినట్టు నియోజకవర్గంలో ఎమ్మెల్యే ప్రచారాలు చేయడం సరికాదన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ వర్క్‌షాపు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ కమిటీ, ఐబీఎం సీఎస్ఆర్ సంయుక్తంగా వర్క్‌షాపు నిర్వహించాయి. కలెక్టర్ ఆధ్వర్యంలో ఇలాంటి నైపుణ్య శిబిరాలు నిర్వహిస్తామని జిల్లా ఉపాధి అధికారి వందన తెలిపారు. ఇందులో స్కిల్ డెవలప్‌మెంట్, జాబ్ రెడీనెస్ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ అల్లం రెడ్డి, అధ్యాపకుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ముస్కాన్ టీమ్ ఎంసీహెచ్ సందర్శన



రికార్డులను పరిశీలిస్తున్న ముస్కాన్ బృందం

సంగారెడ్డి మున్సిపాలిటీ: జిల్లా కేంద్రం సంగారెడ్డి మాతా శిశు కేంద్రాన్ని మూస్కాన్ టీమ్ మంగళవారం సందర్శించారు. ఆస్పత్రిలోని చిన్నపిల్లల, డెలివరీ వార్డులను కలియతిరిగి వైద్య సేవలపై ఆరా తీశారు. ఆస్పత్రిలోని రికార్డులను పరిశీలించారు. హర్యానా, తమిళనాడు నుంచి వచ్చిన వైద్య బృందం వెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ అనిల్, హెచ్‌ఓడీ షబ్బీర్, వైద్యులు తదితరులు ఉన్నారు.

రేవంత్‌రెడ్డికి ఘన స్వాగతం



రేవంత్‌రెడ్డితో కరచాలనం చేసేందుకు పోటీపడుతున్న నాయకులు, కార్యకర్తలు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని గంగ్వార్ చౌరస్తా వద్ద టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఘన స్వాగతం పలికారు. మంగళవారం ఉదయం కర్ణాటకలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి వెళ్లుతున్నారు. విషయం తెలుసుకున్న పార్టీ నాయకుడు భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు గంగ్వార్ చేరుకున్నారు. అక్కడ కారు దిగిన రేవంత్‌రెడ్డికి పూల మాలలు వేసి సన్మానించారు. రేవంత్‌రెడ్డితో కరచలనం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు పోటీ పడ్డారు. అనంతరం ఆయన బీదర్ వెళ్లిపోయారు.

జహీరాబాద్: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి వెళ్తూ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మంగళవారం జహీరాబాద్‌లో కొద్ది సేపు ఆగారు. ఆయనకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కండువాలు కప్పి స్వాగతం పలికారు. ఆయన వెంట మాజీ ఎంపీ సురేశ్ శెట్కార్, తదితరులు ఉన్నారు.

కేతకిలో సినీ ప్రముఖుల పూజలు



కేతకిలో ఉగ్రం సినీ రచయిత తదితరులు

ఝరాసంగం(జహీరాబాద్): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీకేతకి సంగమేశ్వర ఆలయాన్ని ఉగ్రం సినీ రచయిత వెంకట్ దర్శించుకున్నారు. మంగళవారం ఆలయంలో కొలువైన పార్వతీ పరమేశ్వరులకు అభిషేకం, మహా మంగళహారతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించి మొక్కలు చెల్లించుకున్నారు. ఈనెల 5వ తేదీన ఉగ్రం సినిమా విడుదల అవుతున్నట్లు తెలిపారు.

కుంభమేళాకు పెరిగిన రద్దీ

- వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న భక్తులు
- పుణ్యస్నానాలు ఆచరించి ఆలయాల్లో పూజలు
- సాయంత్రం గంగమ్మకు మహా మంగళహారతి



మంజీరా నది వద్ద భక్తుల సందడి



గంగమ్మకు మంగళహారతి ఇస్తున్న దృశ్యం

న్యాల్‌కల్(జహీరాబాద్): కుంభమేళా ముగింపు దగ్గర పడుతున్న కొద్దీ భక్తుల రద్దీ పెరిగింది. తొమ్మిదో రోజు మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి కుటుంబ సమేతంగా భక్తులు తరలి వచ్చి మంజీర నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. ఎండల తీవ్రత తగ్గడంతో మంజీరా నది వద్ద భక్తుల సందడి నెలకొంది. కుంభమేళలో భాగంగా గంగాదేవి ఆలయం ఆవరణలోగల గంగాదేవి, శివలింగానికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం ఆవరణలో యజ్ఞాలు, హోమాలు కొనసాగుతున్నాయి. సాయంత్రం సాధువులు పల్లకీ సేవలో నృత్యాలు చేసుకుంటూ మంజీర నదికి చేరుకొని పవిత్ర స్నానాలు చేశారు. అక్కడ నుంచి ఆలయం వరకు హరహర మహాదేవ్ అంటూ తరలి వెళ్లారు.

గంగమ్మకు పూజలు

సాయంత్రం కాశీనాథ్‌బాబా ఆధ్వర్యంలో సాధువులు, మంజీరా నదికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగాదేవికి హారతి ఇచ్చారు. నదిలో పుణ్యస్నానాలు చేసిన భక్తులు అక్కడ వివిధ మఠాల పీఠాధిపతులు ప్రసంగాలను శ్రద్ధగా ఆలకించారు. ప్రణవానంద స్వామి మహారాజ్, వీరయ్య మహారాజ్, బసవాంబికా మాత తదితరులు ఆధ్యాత్మిక, కుంభమేళా ప్రాముఖ్యతను వివరించారు.

క్లుప్తంగా

హాల్ టికెట్ ఒకరిది.. పరీక్ష రాసేది ఇంకొకరు

ఇరువురిపై కేసు నమోదు

పటాన్‌చెరు టౌన్: ఓపెన్ టెన్త్ పరీక్షల్లో ఓ విద్యార్థి బదులు మరో విద్యార్థి పరీక్ష రాసేందుకు యత్నించిన ఘటనలో పోలీసులు ఇరువురిపై కేసు నమోదు చేశారు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పటాన్‌చెరు సీఐ వేణుగోపాల్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..పటాన్‌చెరు పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓపెన్ పదో తరగతి పరీక్షల్లో భెల్‌కు చెందిన యూనుస్ అనే విద్యార్థికి బదులు సోమవారం సైన్స్ అండ్ టెక్నాలజీ పరీక్ష రాయబోయిన ఫలక్‌నుమాకు చెందిన బాలుడిని పరీక్ష గదికి వెళ్లే ముందు నిర్వహించిన తనిఖీలో పోలీసులు పట్టుకున్నారు. దీంతో ఇరువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జరిమానా

సిద్దిపేటకమాన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్ తనిఖీలో పట్టుబడిన మందుబాబులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం..పట్టణంలోని రాజీవ్ రహదారిపై తమ సిబ్బందితో కలిసి నాలుగు రోజుల క్రితం డ్రంకెన్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. 17 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని మంగళవారం కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన జడ్జి వారికి రూ.38,500 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆది, సోమవారాల్లో నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో 16 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి ఒక్కొక్కరికీ రూ.2 వేల చొప్పున జరిమానా విధించినట్లు ఆయన పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలికి తీవ్ర గాయాలు

మనోహరబాద్(తూప్రాన్): రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలికి తీవ్ర గాయాలైన సంఘటన కాళ్లకల్ శివారులో జాతీయరహదారిపై మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..కామారెడ్డికి చెందిన సాయి అతడి కుటుంబ సభ్యులు ఆటోలో హైదరాబాద్ వైపునకు వెళ్తున్నారు. ఆటో ముందు వెళుతున్న లారీ అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో ఆటో లారీని ఢీ కొట్టింది. ఈ ఘటనలో సాయి తల్లి మల్లమ్మకు తీవ్ర గాయాలయ్యాయి.

కాటేజీల నిర్మాణం చకచకా...

- చివరి దశకు నిర్మాణ పనులు
- వినియోగంలోకి నర్సాపూర్– అర్బన్ పార్కు



నర్సాపూర్ అర్బన్ పార్కులో నిర్మిస్తున్న కాటేజీలు



కొనసాగుతున్న ఫర్నిచర్ పనులు

నర్సాపూర్: నర్సాపూర్‌లో అటవీ శాఖ నిర్మిస్తున్న కాటేజీల నిర్మాణ పనులు చివరి దశకు చేరాయి. ఇక్కడి అడవులను అటవీ శాఖ పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసే దిశగా చర్యలు తీసుకుంటుంది. అందులో భాగంగా నర్సాపూర్–హైదరాబాద్ మార్గంలో అర్బన్ పార్కుగా చేసి వినియోగంలోకి తెచ్చారు. అందులో వాచ్ టవర్‌తో పాటు పలు నిర్మాణాలు చేపట్టి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నారు. ఇక్కడి అటవీ అందాలను వీక్షించే అవకాశం ప్రజలకు కల్పించనున్నారు.

సుమారు రూ. 2కోట్లతో నిర్మాణాలు

అర్బన్ పార్కులో కాటేజీలు నిర్మించాలని అటవీ శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. నర్సాపూర్ రాయరావు చెరువును ఆనుకుని ఉన్న అడవి ప్రాంతంలో కాటేజీలు నిర్మిస్తున్నారు. కాటేజీల నుంచి చెరువు, అడవి సోయగం కనువిందు చేసే విధంగా చర్యలు చేపడుతున్నారు. అందులోభాగంగా సుమారు రూ.2కోట్లతో ప్రణాళిక తయారు చేశారు. కాటేజీల నిర్మాణ పనులు చేస్తున్నారు. 2 అధికారుల నివాసపు కాటేజీలు, డైనింగ్ హాలు, ఐదు విజిటర్స్ నివాసపు కాటేజీలు, ఒక విజిటర్స్ డైనింగ్ కాటేజీ, కామన్ కిచెన్, రిసెప్షన్ కలిపి 11 నిర్మిస్తున్నారు. కాటేజీల పక్కన నీటి సదుపాయానికి ట్యాంకు నిర్మాణం చేపట్టారు. దాదాపు కాటేజీల నిర్మాణ పనులు పూర్తవగా కొన్నింటిలో చిన్న చిన్న పనులు కొనసాగుతున్నాయి.

కాటేజీలు అందుబాటులోకి వస్తే మరింత అభివృద్ధి

అర్బన్ పార్కుతో నర్సాపూర్ అడవులు ఇప్పటికే పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందింది. శని, ఆదివారాల్లో మెదక్, హైద్రాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి తదితర జిల్లాలకు చెందిన ప్రజలు అర్బన్ పార్కును వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారు. అటవీ శాఖ నిర్మిస్తున్న కాటేజీల నిర్మాణం పూర్తయి వినియోగంలోకి వస్తే పర్యాటక ప్రాంతంగా మరింత అభివృద్ధి చెందుతుందని అధికారులు చెబుతున్నారు.

త్వరలో ప్రారంభిస్తాం

నర్సాపూర్ అటవీ ప్రాంతంలో నిర్మిస్తున్న కాటేజీల నిర్మాణ పనులు చివరి దశకు వచ్చాయని స్థానిక ఎఫ్ఆర్ఓ అంబర్‌సింగ్ చెప్పారు. కాటేజీలలో చిన్న చిన్న పనులు ఉండగా వాటిని చేపడుతున్నారని ఆయన పేర్కొన్నారు. అన్ని పనులు పూర్తయిన వెంటనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

–అంబర్‌సింగ్, ఎఫ్ఆర్ఓ, నర్సాపూర్

గోడ కూలి మహిళ దుర్మరణం



శిథిలాల కింద అనూష



అనూష (ఫైల్)

అక్కన్నపేట(హుస్నాబాద్): గోడ కూలి మహిళ దుర్మరణం పాలైన ఘటన అక్కన్నపేట మండలం, గుడాటిపల్లి గ్రామ పరిధిలోని సోమాజితండాలో చోటుచేకుంది. ఎస్ఐ తాండ్ర వివేక్ తెలిపిన వివరాల ప్రకారం..హుస్నాబాద్ మండలం మీర్జాపూర్ గ్రామానికి చెందిన బదనాపురం అనూష(30)వార్డు మెంబర్‌గా ఎన్నికైనప్పటికీ బతుకుదెరువు కోసం ఇనుప సామాన్లు ఏరుకొని అమ్ముకోవడం, భర్త కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఈ క్రమంలోనే గౌరవెల్లి ప్రాజెక్టు పనులు చివరిదశకు చేరుకోవడంతో అక్కడ వారం రోజులుగా అనూష ఇనుప సామాన్లను ఏరుకుంటుంది. సోమవారం కూడా ఓ ఇంట్లో ఇనుప సామాన్లను ఏరడానికని వెళ్లి తిరిగి రాలేదు. భర్త, కుటుంబీకులు ఫోన్ చేసినా ఆమె స్పందించ లేదు. మంగళవారం భర్త, అత్త, బంధువులు గుడాటిపల్లి ముంపు గ్రామాల్లో వెతికారు. మధ్యాహ్నం సోమాజితండాలో పాడుబడిన ఇల్లు గోడకూలిన శిథిలాల్లో విగతజీవిగా కనిపించింది. దీంతో ఆమెను చూసిన బంధువులు, కుటుంబీకులు కన్నీరుమున్నీరయ్యారు. భర్త తిరుపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ వివేక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బాలిక అదృశ్యం

జిన్నారం(పటాన్‌చెరు): ఇటుక బట్టీ వద్ద ఆడుకుంటుండగా ఓ బాలిక అదృశ్యమైన ఘటన గుమ్మడిదల మండలంలోని అన్నారం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ విజయకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం..ఒడిషా రాష్ట్రం బోలింగర్ జిల్లా, పట్నంఘర్‌లోని, జోలెన్ బార్ గ్రామానికి చెందిన చిత్రసావర్, భనీతసావర్‌లు రవిబాబు నడిపిస్తున్న ఇటుక బట్టీలో పనులు చేసేందుకు ఐదు నెలల క్రితం వచ్చి స్థిరపడ్డారు. వీరి ఇద్దరి పిల్లలతో పాటు తొమ్మిదేళ్ల కాజల్‌ను కూడా తోడు తెచ్చుకున్నారు. గత నెల 30న కాజల్ ఆడుకునేందుకు వెళ్లి తిరిగి రాలేదు. సమీపంలో ఎంత వెతికినా బాలిక ఆచూకీ తెలియలేదు. ఈ విషయాన్ని భనీతసావర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ విజయకృష్ణ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దళిత బంధు యూనిట్ల తనిఖీ



తనిఖీ చేస్తున్న ప్రత్యేకాధికారి ముత్యంరెడ్డి

గజ్వేల్: గజ్వేల్ మండలం కొల్గూర్ గ్రామానికి చెందిన 'దళిత బంధు' యూనిట్లు పొంది వివిధ వ్యాపారాలను నిర్వహించుకుంటున్న తీరును మంగళవారం గజ్వేల్‌లో 'గడా' ప్రత్యేకాధికారి ముత్యంరెడ్డి తనిఖీ చేశారు. రెడీమేడ్, హర్డువేర్ షాపులు ఇతర వ్యాపారాలు నిర్వహిస్తూ ఎంత ఆదాయం పొందుతున్నారో ? వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు నెలనెలా మంచి ఆదాయం పొందుతున్నామని తమ పిల్లలకు నాణ్యమైన విద్యను అందించగలుగుతున్నామని 'గడా' అధికారికి వారు వివరించారు. ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చేవిధంగా దళిత బంధును సద్వినియోగం చేసుకోవాలని ముత్యంరెడ్డి వారికి సూచించారు.

పౌరసరఫరా అధికారుల తనిఖీలు



చేర్యాలలో తనిఖీలు చేస్తున్న అధికారులు

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల పట్టణ కేంద్రంలోని కడవేర్గు రోడ్డులోని రాజస్థాన్ స్వీట్ హౌజ్‌లో ఎమ్మార్పీ ధర కంటే ఎక్కువకు అమ్ముతున్నారని తెలంగాణ కన్స్యూమర్ ఫోరం చేర్యాల మండల అధ్యక్షుడు జి.రవి కుమార్ ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం జిల్లా తునికల, కొలతల అధికారి శ్రీనివాస్ రెడ్డి సిబ్బందితో కలిసి సంబంధిత స్వీట్ హౌజ్‌ను తనిఖీ చేశారు. వారిని విచారించిన అనంతరం ఎమ్మార్పీధర కంటే ఎక్కువకు విక్రయిస్తున్నారని తేలడంతో యజమానిపై కేసు నమోదు చేసినట్లు అధికారి తెలిపారు.

ఆన్‌లైన్‌లో సైబర్ మోసం

- ఇద్దరికి రెట్టింపు నగదు ఆశ చూపి.. రూ.31,60,000లు అపహరణ



పటాన్‌చెరు టౌన్: రెట్టింపు నగదు ఇస్తామని ఆశ చూపి ఆన్‌లైన్‌లో ఇద్దరు వ్యక్తుల నుంచి పెద్ద ఎత్తున నగదు సైబర్ నేరగాళ్లు దోచుకున్న సంఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. అమీన్పూర్ సీఐ శ్రీనివాసులు రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..అమీన్‌పూర్‌కు చెందిన ఓ ప్రైవేట్ ఉద్యోగి ఏప్రిల్ 20వ తేదీన వాట్సాప్‌లో గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చిన మెసేజ్‌కు స్పందించాడు. ఇందులో పెట్టుబడి పెట్టి టాస్క్ పూర్తి చేస్తే రెట్టింపు నగదు ఇస్తామని ఆశచూపారు. వారి మాటలు నమ్మిన బాధితుడు ఏడు రోజుల పాటు రూ.30లక్షల వరకూ పెట్టుబడి పెడుతూ వచ్చాడు. ఇచ్చిన టాస్కులన్నీ పూర్తి చేశాడు. అనంతరం పెట్టిన నగదుతో పాటు రెట్టింపు నగదు ఇవ్వాలని సదరు బాధితుడు కోరాడు. ఆ వ్యక్తుల నుంచి ఎలాంటి స్పందన రాలేదు. వెంటనే బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్ క్రైంలో ఫిర్యాదు చేశాడు.

మరోఘటనలో

అమీన్‌పూర్ పరిధిలోని పటేల్‌గూడకు చెందిన ఓ వ్యక్తి ఏప్రిల్ 15న తన ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. దీంతో బాధితుడు 16వ తేదీన వివరాలు నమోదు చేసి రూ.1,60,000లు పెటాడు. ఇచ్చిన టాస్కుల అనంతరం తిరిగి నగదు చెల్లించమని అడగగా స్పందించలేదు. దీంతో తను కూడా సైబర్ మోసానికి గురైనట్లు గుర్తించి ఫిర్యాదు చేశాడు. ఆ తరువాత అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఇరువురి ఫిర్యాదులను నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య



గుండ్ల బాబు (ఫైల్)

చేగుంట(తూప్రాన్): రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని వడియారం శివారులో చోటు చేసుకుంది. గ్రామస్తులు, రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..వడియారం గ్రామానికి చెందిన గుండ్ల బాబు(27) ఓ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం తను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సమీప బంధువునకు ఫోన్‌లో సమాచారం చేరవేశాడు. దీంతో అతను వడియారం శివారులో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు ఆత్మహత్య విషయాన్ని రైల్వే పోలీసులకు సమాచారం అందజేశారు. రైల్వే ఎస్ఐ తావూ నాయక్ కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం కామారెడ్డి ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

చికిత్స పొందుతున్న ఇద్దరి మృతి

ద్విచక్రవాహనాలు అదుపు తప్పి చికిత్స పొందుతూ ఇద్దరు మృతి చెందారు.

సంగారెడ్డి మున్సిపాలిటీ: చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి చౌటకూరు మండలంలో జరిగింది. పుల్కల్ ఎస్ఐ విజయకుమార్ తెలిపిన వివరాల ప్రకారం..నారాయణ ఖేడ్ పట్టణానికి చెందిన సందిప్ గౌడ్(18) ఏప్రిల్24 నారాయణఖేడ్ నుంచి ఐపీఎల్ మ్యాచ్ చూడడానికి బైక్‌పై హైదరాబాదుకు వెళ్లి వస్తున్న క్రమంలో చౌటకూర్ మండల పరిధిలోని సుల్తాన్‌పూర్ గ్రామ శివారులో నేషనల్ హైవేపై ప్రమాదవశాత్తు కిందపడి తలకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో అక్కడి వారు 108లో అంబులెన్స్‌లో సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యుల సలహా మేరకు మెరుగైన చికిత్సనిమిత్తం హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. తల్లి విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సిద్దిపేటఅర్బన్: ద్విచక్ర వాహనం అదుపుతప్పి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన సిద్దిపేట పట్టణంలో మంగళవారం జరిగింది. సీఐ భానుప్రకాష్ తెలిపిన వివరాల ప్రకారం..ప్రశాంత్‌నగర్ వడ్డెర కాలనీకి చెందిన బండి లింగయ్య (30) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం పని కోసం తన ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. పని ముగించుకొని వస్తున్న క్రమంలో హరిహర రెసిడెన్సీ కాలనీ సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడిపోయాడు. స్థానికులు గమనించి అంబులెన్స్ ద్వారా సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు.

పిల్లల బాధ్యత తల్లిదండ్రులదే

ఎస్పీ రోహిణి ప్రియదర్శిని

మెదక్ మున్సిపాలిటీ: వేసవి సెలవుల్లో పిల్లలు ప్రమాదాల బారిన పడకుండా తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని తెలిపారు. మంగళవారం మెదక్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ..పాఠశాలలకు వేసవి సెలవులు ఇచ్చారు. దీంతో పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. సరదా కోసం చెరువులు.. బావులకు ఈతకు వెళ్లే పిల్లల విషయంలో తల్లిదండ్రులు మరింత జాగ్రత్తగా ఉండాలన్నారు. లేదంటే ఈత సరదా ప్రమాదంగా మారే అవకాశం ఉందని ఆమె హెచ్చరించారు. ద్విచక్ర వాహనాలు, కార్లను మైనర్లకు ఇవ్వొదన్నారు.

'సూరంపల్లి సర్పంచ్‌ను వెంటనే సస్పెండ్ చేయాలి'

దుబ్బాక: అంబేడ్కర్ జయంతిలో పాల్గొన కుండా ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించారని వెంటనే సర్పంచ్ నర్సింలును సస్పెండ్ చేయాలని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ డిమాండ్ చేశారు. మంగళవారం దౌల్తాబాద్ ఎంపీడీఓ రాజేష్ కుమార్‌కు ఆయన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ జయంతిలో సర్పంచ్, ఎందుకు పాల్గొనలేదని ప్రశ్నించినందుకు తన స్థాయిని మరచి బూతులు తిట్టాడని ఆరోపించారు.

కారు ఢీ కొని వ్యక్తి..



ప్రమాద స్థలిని పరిశీలిస్తున్న సీఐ, ఎస్ఐ

న్యాల్‌కల్(జహీరాబాద్): కారు ఢీ కొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని గంగ్వార్ గ్రామ శివారులో మంగళవారం చోటు చేసుకుంది. హద్నూర్ ఎస్ఐ వినయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..బీదర్ జిల్లా యాకత్‌పూర్ గ్రామానికి చెందిన అబ్దుల్ సమద్(55) తన మనుమడి ఆరోగ్యం బాగా లేకపోవడంతో న్యాల్‌కల్ మండల పరిధిలోని గంగ్వార్ గ్రామ సమీపంలో గల సాహెబ్ వద్దకు వచ్చాడు. కూతురిని, మనుమడిని అక్కడ దించి తిరిగి వెళ్తున్న క్రమంలో వెనకాల నుంచి అతి వేగంగా కారు బైక్‌ను ఢీ కొంది. ఈ ఘటనలో అబ్దుల్ సమద్‌కి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అబ్దుల్ సమద్‌ను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందినట్లు ఎస్ఐ వినయ్‌కుమార్ తెలిపారు. సంఘటన స్థలాన్ని జహీరాబాద్ రూరల్ సీఐ వెంకటేశ్ సందర్శించారు. మృతుడి కుమారుడు ఎండీ ఇలియాస్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత

సిద్దిపేటకమాన్: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సీఈఐఆర్‌తో గుర్తించి సిద్దిపేట టూటౌన్ పోలీసులు బాధితుడికి అందజేశారు. సీఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం..పెద్దమాసాన్‌పల్లి గ్రామానికి చెందిన దేవిరెడ్డి తన సెల్‌ఫోన్‌ను ఏప్రిల్ 22వ తేదీన పట్టణంలో పోగొట్టుకున్నాడు. ఈ విషయాన్ని టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ పోర్టల్‌లో సెల్‌ఫోన్ వివరాలు నమోదు చేసి బ్లాక్ చేశారు. అనంతరం ఫోన్ ఆచూకీ తెలుసుకొని రికవరీ చేశారు. బాధితుడిని మంగళవారం పిలిపించి సీఐ రవికుమార్ అందజేశారు. సీఐ రవికుమార్ మాట్లాడుతూ సెల్‌ఫోన్ పోగొట్టుకుంటే సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు.


గజ్వేల్‌రూరల్‌లో..

గజ్వేల్‌రూరల్: గజ్వేల్ పట్టణానికి చెందిన ఓ వ్యక్తి పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను తిరిగి అప్పగించినట్లు సీఐ వీరప్రసాద్ తెలిపారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణానికి చెందిన చిక్కుడు యాదగిరి వారంరోజుల క్రితం తన సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడన్నారు. ఫోన్‌కు సంబంధించిన వివరాలను సీఈఐఆర్‌లో నమోదు చేసి అనంతరం ఫోన్ ఆచూకీ తెలుసుకొని బాధితునికి అప్పగించినట్లు ఆయన పేర్కొన్నారు.

దొంగతనానికి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

ఝరాసంగం(జహీరాబాద్): కూరగాయలు అమ్ముతున్న మహిళ మెడలో నుంచి పుస్తెలతాడును తెంపుకొని పారిపోతుండగా స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..మండల పరిధిలోని సంఘం(కె) గ్రామానికి చెందిన పట్లోళ్ల విట్టమ్మ ఝరాసంగంలో ప్రతి సోమవారం నిర్వహించే వారాంతపు సంతలో టమాటాలు అమ్ముతుంది. ఈ క్రమంలో కొండాపూర్ మండల పరిధిలోని తొగర్ పల్లి గ్రామానికి చెందిన బి. నర్సింలు టమాటాలు కావాలని అడిగాడు. ఆమె టమాటాలు ఇస్తున్న క్రమంలో మెడలో నుంచిపుస్తెలతాడు తెంచుకొని పారిపోతుండగా స్థానికులు అతన్ని పట్టుకున్నారు. దేహశుద్ధి అనంతరం పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాజేందర్ రెడ్డి కేసు నమోదు చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

కొడిపల్లిలో ప్రైవేటు ఆస్పత్రి సీజ్



రికార్డులు తనిఖీ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయనిర్మల

కొడిపల్లి(నర్సాపూర్): కొడిపల్లిలో సరైన ధ్రువపత్రాలులేని ప్రైవేటు ఆస్పత్రిని సీజ్ చేయడంతోపాటు మరో రెండు ఆసుపత్రులకు జిల్లా వైద్యా ఆరోగ్యశాఖ అధికారులు నోటీసులు జారీచేశారు. మంగళవారం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయనిర్మల కొడిపల్లిలోని సీహెచ్‌సీతోపాటు శ్రీవేంకటేశ్వర నర్సింహోం, కేర్ నర్సింగ్‌హోం, ఉమా నర్సింగ్‌హోంను తనిఖీ చేశారు. సరైన ధ్రువపత్రాలులేని ప్రైవేటు ఆసుపత్రిని సీజ్ చేసి నోటీసులు జారీ చేశారు. వారం రోజుల్లో నర్సింగ్‌హోంకు సంబంధించి ధ్రువపత్రాలు అందచేయాలని నిర్వాహకులను ఆదేశించారు. ఇచ్చిన గడువులోపు సరైన ధ్రువపత్రాలు సమర్పించకపోతే కఠిన చర్యలు తప్పవన్నారు.

ఆలయాల్లో చోరీ

రామాయంపేట(మెదక్): రామాయంపేటలోని రెండు ఆలయాల్లో సోమవారం చోరీ జరిగింది. పాండచెరువు కట్టపై ఉన్న కల్యాణ రామచంద్రస్వామి, గొల్పర్తి పెద్దమ్మ ఆలయ తాళాలు పగులగొట్టి అమ్మవారి మెడలో ఉన్న బంగారు పుస్తెల తాడుతోపాటు నగదు అపహరించుకపోయారు. క్లూస్‌టీం వివరాలు సేకరించారు.

స్థల వివాదంలో ఘర్షణ

నలుగురికి తీవ్ర గాయాలు



ఘర్షణ జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీఐ నాగరాజు



గాయపడ్డ సంపత్



సాయినాథ్ గౌడ్

జోగిపేట(అందోల్): జోగిపేట పట్టణంలో ఓ స్థల వివాదం ఇరువర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. ఈ ఘటనలో ఇరువురికి గాయాలయ్యాయి. మంగళవారం జోగిపేట సీఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని సర్వేనెంబర్ 174లోని భూమిలో చాలా కాలంగా ఇరు వర్గాల మధ్య గొడవ జరుగుతుంది. ఆ స్థలంలో పట్టణానికి చెందిన ఇంటెలిజెన్స్ డీఎస్పీ సయ్య మహేష్, అతని కుమారుడు తేజ ఆ స్థలంలో నిర్మాణం చేపడుతుండగా హనుమంతరావుపేట సంపత్ గౌడ్, సాయినాథ్ గౌడ్‌లు పని నిలిపివేయాలని వారిని కోరారు. ఈ క్రమంలో ఇరువురి మధ్య మాట మాట పెరిగింది. ఒకరిపై మరొకరు దాడులకు దిగారు. డీఎస్పీ మహేష్ కుమారుడు తేజ సంపత్, సాయినాథ్‌పై దాడి చేయడంతో తలకు, కాలు, చేయి, దవడకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే వారిని జోగిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తేజను సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని సీఐ నాగరాజు పరిశీలించారు.

పరస్పరం ఫిర్యాదులు

డీఎస్పీ సయ్య మహేష్, అతని కొడుకు తేజా తమపై ఇనుప రాడ్డు, నేకల్ పంచుతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని రామాగౌడ్ జోగిపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తమపై కూడా రామాగౌడ్, ప్రవీణ్ గౌడ్, సంపత్ గౌడ్, ప్రదీప్ గౌడ్‌లతోపాటు పదిమంది దాడి చేసినట్లు సయ్య మహేష్ న్యాయవాది ద్వారా జోగిపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఇరువర్గాలపై హత్యాయత్నం కేసు

జోగిపేటలో భూ వివాదానికి సంబంధించి జరిగిన ఘర్షణలో ఇరువర్గాలపై హత్యాయత్నం కేసులు నమోదు చేసినట్లు జోగిపేట ఎస్ఐ–2 జయశంకర్ తెలిపారు. సంపత్‌గౌడ్, సాయినాథ్‌గౌడ్‌లపై దాడి జరిపిన కేసులో తేజ, డీఎస్పీ మహేష్‌లపై హత్యాయత్నం కేసు నమోదు చేశామన్నారు. డీఎస్పీ మహేష్ చేసిన ఫిర్యాదుతో నలుగురితో పాటు మరికొంతమందిపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కేసులో విచారణ జరిపి తగుచర్యలు తీసుకుంటామని సీఐ నాగరాజు పేర్కొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీ

నలుగురికి గాయాలు

కొల్చారం(నర్సాపూర్): రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొని నలుగురికి గాయాలైన సంఘటన మండల కేంద్రం సమీపంలోని మెదక్–నర్సాపూర్ జాతీయ రహదారి లోతువాగు మూల మలుపు వద్ద మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం..రంగారెడ్డి జిల్లా బాలానగర్‌కు చెందిన నలుగురు వ్యక్తులు రెండు ద్విచక్ర వాహనాలపై ఏడుపాయల వనదుర్గాదేవిని దర్శించుకునేందుకు వెళ్తునట్లు తెలిపారు. అమ్మవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణంలో లోతు వాగు సమీపంలోకి రాగానే, బైకులు అదుపుతప్పి ఒకరినొకరు ఢీ కొన్నారు. దీంతో నలుగురికి గాయాలు కాగా వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు అంబులెన్స్ సిబ్బంది తెలిపారు.